తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 9- ఆగస్టు 2026 | సంపుటి : 4 | సంచిక : 66 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in

# వరంగల్‌లో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన

**మూడు జిల్లాల పోలీసు అధికారులతో సమీక్ష..**
**నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి**



వరంగల్,ఆగస్టు08(తెలంగాణ ముచ్చట్లు):
రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ రెండు రోజుల ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా వరంగల్‌కు చేరుకున్నారు. ఆయనకు పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.పర్యటనలో భాగంగా ఉమ్మడి జిల్లాలోని పోలీసు శాఖ పనితీరుపై డీజీపీ సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా నివేదికలను పరిశీలించడంతో పాటు ఆయా స్టేషన్లలో ఉన్న సమస్యలు, పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకోనున్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులకు అవసరమైన సూచనలు,

మిగతా 2లో



## పెద్ది కుటుంబానికి అండగా..
# పెద్దాయన!

- దివంగత నేత కుటుంబానికి కేసీఆర్ భరోసా..
- రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందించనున్న కెసిఆర్
- నేడు పెద్ది నివాసానికి పెద్దాయన

వరంగల్,ఆగస్టు08(తెలంగాణ ముచ్చట్లు):
దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబం ఒంటరిగా లేదని భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ మరోసారి స్పష్టం చేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలవడమే కాకుండా.. వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు.
పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి పార్టీ తరఫున రూ.2 కోట్ల 25 లక్షల ఆర్థిక సహాయం అందించాలని

మిగతా 2లో



# పోలీస్ బాస్ జర చూడండి..!

**ఖాళీ పోస్టుల భర్తీ నుంచి సిబ్బంది సమస్యల వరకు.. పరిష్కారంపై ఆశలు**

వరంగల్,ఆగస్టు08(తెలంగాణ ముచ్చట్లు):
రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరంగల్, జనగామ ఏసీపీ పోస్టులు నాలుగు నెలలుగా ఖాళీగా ఉన్నట్లు సమాచారం. దీంతో ఆయా విభాగాల పర్యవేక్షణ, పరిపాలనా వ్యవహారాలపై ప్రభావం పడుతున్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదేవిధంగా ధర్మసాగర్, నర్మెట సీఐ పోస్టులతో పాటు నెక్కొండ ఎస్సై పోస్టు కూడా కొంతకాలంగా భర్తీకి నోచుకోలేదని తెలుస్తోంది.
మరోవైపు నూతన కమాండ్ కంట్రోల్ భవనం ప్రారంభం, ఏఆర్ సిబ్బందికి సంబంధించిన టీఏ బకాయిల చెల్లింపు, అవసరమైన ప్రాంతాల్లో

మిగతా 2లో



# హైడ్రా ఉద్యోగాలకు భారీ స్పందన

- మూడు వేల మందికి పైగా యువత హాజరు..
- నియంత్రించేందుకు అధికారుల అవస్థలు

హైదరాబాద్, ఆగస్టు 8(తెలంగాణ ముచ్చట్లు):
హైడ్రాలో విపత్తు స్పందన దళం సహాయకులు, డ్రైవర్ల నియామకానికి యువత భారీగా తరలివచ్చింది. సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన ఎంపిక ప్రక్రియకు మూడు వేల మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు.
హైడ్రాలో 100 మంది విపత్తు స్పందన దళం సహాయకులు, 50 మంది డ్రైవర్ల పోస్టుల భర్తీకి అధికారులు ఎంపిక ప్రక్రియ చేపట్టారు.

మిగతా 2లో

# వరి సాగుపై మంత్రి హెచ్చరిక

- ఆరుతడి పంటలకే ప్రాధాన్యం
- నాగార్జునసాగర్ నీరు తాగునీటికే
- రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశం



నల్గొండ, ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):
ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగును విస్తరించవద్దని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీరు తాగునీటికే సరిపోతుందని, పైనుంచి నీటి ప్రవాహం వచ్చే పరిస్థితులు కనిపించడం లేదని అన్నారు. రైతులు ఆరుతడి పంటల సాగు వైపు మళ్లేలా అధికారులు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. నల్గొండ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో పాల్గొన్న మంత్రి, నాగార్జునసాగర్‌లో ప్రస్తుతం నీరు డెడ్ స్టోరేజ్ స్థాయిలో మాత్రమే ఉందని తెలిపారు.

మిగతా 2లో



# సాగునీటి ప్రాజెక్టులకు వేగం

- రూ.5,000 కోట్ల నిధులకు సీఎం హామీ
- భూసేకరణ, పునరావాస పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం
- పతిపాక జలాశయ డీపీఆర్ ఆగస్టు నెలాఖరులోపు సిద్ధం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2లో

# ఎస్ఐఆర్ ప్రక్రియపై బీజేపీ దృష్టి

- అర్హులైన ఓటర్ల నమోదుకు పిలుపు
- అక్రమ నమోదులపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- హైదరాబాద్‌లో ఎస్ఐఆర్ వర్క్‌షాప్ నిర్వహణ

2లో



# నీటి హక్కుల పరిరక్షణకు పోరాటం

- ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- రైతాంగ సమస్యలు, సాగునీటిపై ఆందోళన
- తెలంగాణ ఉద్యమ తరహాలో మరో పోరాటానికి పిలుపు

హైదరాబాద్, ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):
రాష్ట్ర ప్రయోజనాలు, ముఖ్యంగా తెలంగాణ నీటి హక్కుల విషయంలో బీఆర్ఎస్ ఎప్పుడూ రాజీ పడదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ముఖ్యంగా సాగునీరు, విద్యుత్, రైతాంగ సమస్యల విషయంలో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనబెట్టి రాజకీయాలకే పరిమితమవుతున్న ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వరంగల్‌లో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన


(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాలు ఇవ్వనున్నారు.

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మూడు జిల్లాల పోలీసు అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. మూడు జిల్లాల డీసీపీలు, ఏసీపీలు, పోలీస్ స్టేషన్‌ల ఇన్‌చార్జిలు సమావేశానికి హాజరుకానున్నారు. నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, గస్తీ నిర్వహణ, ప్రజలకు అందుతున్న పోలీసు సేవలు తదితర అంశాలపై సమీక్ష జరపనున్నారు.అలాగే పోలీస్ బెటాలియన్‌ను డీజీపీ పరిశీలించి సిబ్బందితో మాట్లాడనున్నారు. పోలీసుల పనితీరు, విధుల నిర్వహణ, ప్రజలతో వ్యవహరించాల్సిన తీరుపై అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు.

పర్యటనలో భాగంగా ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల పోలీసు అధికారులతోనూ డీజీపీ సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. ఆయా జిల్లాల ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు సమావేశాల్లో పాల్గొంటారు.ప్రధానంగా మత్తు పదార్థాల నియంత్రణ, నేరాల కట్టడి, ఇసుక అక్రమ రవాణా, భూ వివాదాలు, సెటిల్మెంట్లపై డీజీపీ ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. నేరాల నియంత్రణతో పాటు పోలీసులు ప్రజలతో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అంశాలపైనా చర్చించనున్నారు.పోలీసు శాఖలో అధికారులపై వచ్చిన ఆరోపణలు, వారి పనితీరుపైనా డీజీపీ సమీక్షలో ప్రస్తావించే అవకాశం ఉన్నట్లు సమాచారం. డీజీపీ ఉమ్మడి జిల్లా పర్యటన నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

# పోలీస్ బాస్ జర చూడండి..!




(మొదటి పేజీ తరువాయి)

కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటు వంటి అంశాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు.దీర్ఘకాలంగా ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఎస్సైలు, సీఐల బదిలీల అంశంపైనా స్పష్టత రావాల్సిన అవసరం ఉందని పోలీసు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. పోలీసు శాఖలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడంతో పాటు క్షేత్రస్థాయిలో సిబ్బందిపై పని ఒత్తిడిని తగ్గించేందుకు ఖాళీ పోస్టులను త్వరగా భర్తీ చేయాలని కోరుతున్నారు.డీజీపీ పర్యటన సందర్భంగా నేరాల నియంత్రణ, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల నివారణ వంటి అంశాలతో పాటు కమిషనరేట్ పరిధిలోని ఖాళీ పోస్టులు, సిబ్బంది సమస్యలు, మౌలిక వసతులు, బదిలీల అంశాలపైనా పోలీస్ బాస్ ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

## పెద్ది కుటుంబానికి అండగా..

# పెద్దాయన!



(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో పెద్ది సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున, వృద్ధాప్యంలో ఉన్న వారి తల్లి అమృతమ్మ బాగోగులు, కుటుంబ అవసరాల కోసం మరో రూ.25 లక్షలు అందించనున్నారు.

**కష్టంలో ఉన్న కుటుంబానికి కొండంత అండ**

పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఇలాంటి సమయంలో ఆ కుటుంబానికి పార్టీ అండగా నిలవాలని కేసీఆర్ నిర్ణయించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఆర్థిక సాయం అందించడంతోనే బాధ్యత ముగిసిపోదని.. పెద్ది కుటుంబ పిల్లల భవిష్యత్తు, వారి చదువులు, కుటుంబ సంక్షేమం తదితర అంశాలను పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు.

**జిల్లా నాయకులతో చర్చించి నిర్ణయం**

పెద్ది కుటుంబ పరిస్థితి, వారి భవిష్యత్తు అవసరాలపై పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో కేసీఆర్ చర్చించారు. ఆ చర్చల అనంతరం కుటుంబానికి తక్షణ ఆర్థిక భరోసాతో పాటు భవిష్యత్తులోనూ పార్టీ అండగా ఉండేలా నిర్ణయం తీసుకున్నారు.

**దశదినకర్మల అనంతరం మరిన్ని నిర్ణయాలు**

పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మల కార్యక్రమాలు పూర్తయిన అనంతరం వరంగల్ జిల్లా పార్టీ ముఖ్య నాయకులు సమావేశమై కుటుంబ సంక్షేమానికి సంబంధించిన తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనున్నారు.

పిల్లల చదువులు, భవిష్యత్తు, కుటుంబ అవసరాలు వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని అవసరమైన సహకారాన్ని అందించేలా కార్యాచరణ రూపొందించనున్నారు.

**మాటల్లో కాదు.. కష్టకాలంలో చేతల్లో**

రాజకీయాల్లో నాయకత్వం అంటే కేవలం పదవులు, సభలు, సమావేశాలు మాత్రమే కాదని.. తమతో కలిసి నడిచిన వారి కుటుంబాలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడమే అసలైన నాయకత్వమనే సందేశాన్ని కేసీఆర్ నిర్ణయం చాటుతోంది.

పెద్ది సుదర్శన్ రెడ్డి లేరు.. కానీ ఆయన కుటుంబానికి తాము ఉన్నామనే భరోసాను కేసీఆర్ ఇచ్చారు.రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం ఒకవైపు కుటుంబానికి తక్షణ భరోసానిస్తే.. పిల్లల భవిష్యత్తును పార్టీ చూసుకుంటుందన్న హామీ మరోవైపు వారికి ధైర్యాన్ని ఇస్తోంది.

పెద్ది కుటుంబానికి అండగా...
పెద్దాయన నిలిచారు!
ఇది కేవలం ఆర్థిక సాయం కాదు...
ఒక కుటుంబానికి ఇచ్చిన భరోసా.
ఒక నాయకుడి కుటుంబాన్ని తమ కుటుంబంగా భావించిన రాజకీయ పెద్ద మనసుకు నిదర్శనం.

# హైడ్రా ఉద్యోగాలకు భారీ స్పందన

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 8, 9 తేదీల్లో సరూర్‌నగర్ స్టేడియంలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామని ముందుగానే ప్రకటించడంతో పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చింది.

ఒక్కసారిగా వేలాది మంది అభ్యర్థులు స్టేడియానికి చేరుకోవడంతో దరఖాస్తుల స్వీకరణ, శారీరక పరీక్షలకు టోకెన్ల జారీ సమయంలో కొంత గందరగోళం ఏర్పడింది. అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ఒకేసారి ముందుకు రావడంతో వారిని క్రమబద్ధీకరించేందుకు అధికారులు, పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.ఈ క్రమంలో ఓ అధికారి అసహనానికి గురై అభ్యర్థులతో పరుషంగా మాట్లాడిన ఘటన చోటుచేసుకుంది. అనంతరం పరిస్థితిని అర్థం చేసుకుని అధికారులు అభ్యర్థులకు నచ్చజెప్పారు.

**లౌడ్ స్పీకర్లలో పదేపదే ప్రకటన**

అందరి వద్ద దరఖాస్తులు స్వీకరిస్తామని, ఎవరికీ అన్యాయం జరగదని, ప్రతి ఒక్కరికీ శారీరక పరీక్షలకు అవకాశం కల్పిస్తామని అధికారులు లౌడ్ స్పీకర్ల ద్వారా పదేపదే ప్రకటించారు. దీంతో యువత పరిస్థితిని అర్థం చేసుకుని అధికారులకు సహకరించింది. ఎలాంటి తొక్కిసలాటకు అవకాశం లేకుండా పోలీసులు, హైడ్రా అధికారులు సమన్వయంతో వ్యవహరించారు. మొదట్లో కొంత ఇబ్బంది ఎదురైనప్పటికీ అనంతరం ఎంపిక ప్రక్రియ సజావుగా కొనసాగింది.

**ఉద్యోగాల కోసం భారీగా తరలివచ్చిన యువత**

కేవలం 150 పోస్టుల కోసం మూడు వేల మందికి పైగా అభ్యర్థులు హాజరుకావడం ఈ నియామకాలకు యువతలో ఉన్న ఆసక్తిని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉద్యోగం కోసం యువత ఎంతటి పోటీకి సిద్ధంగా ఉందో ఈ భారీ హాజరు మరోసారి చాటిచెప్పింది.

# సాగునీటి ప్రాజెక్టులకు వేగం

**హైదరాబాద్, ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులకు మళ్లీ వేగం తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు వంటి కారణాలతో ఆలస్యమవుతున్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.5,000 కోట్ల నిధులను ప్రాధాన్య క్రమంలో కేటాయించేందుకు హామీ ఇచ్చినట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇందులో ఇప్పటికే రూ.2,000 కోట్లు విడుదల కాగా, మిగిలిన రూ.3,000 కోట్లు విడుదల ప్రక్రియలో ఉన్నాయని వెల్లడించారు. నిధుల కొరత కారణంగా ఏ ప్రాజెక్టు పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సామాజిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి



అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్లు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు.

భూసేకరణ, పునరావాసం, అటవీ అనుమతులు, పర్యావరణ అనుమతులు వంటి పెండింగ్ అంశాలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల వల్ల ప్రభావితమయ్యే కుటుంబాలకు పరిహారం చెల్లింపులు, పునరావాస కార్యక్రమాలు ఇంజినీరింగ్ పనులతో సమాంతరంగా కొనసాగాలని సూచించారు. అవసరమైన నిధుల వివరాలను వెంటనే సమర్పించి ఆమోదాలు పొందాలని కలెక్టర్లకు సూచించారు. రైతులకు త్వరగా సాగునీటి ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని తెలిపారు. సమీక్షలో ప్రధానంగా మిడ్ మానేరు ఎడమ కాలువ ప్రాజెక్టు అంశం చర్చకు వచ్చింది. గత నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన ఈ పనులను తక్షణమే పునఃప్రారంభించేందుకు అవసరమైన భూసంబంధిత సమస్యలను పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. సవరించిన అంచనాలు, టెండర్లు, భూసేకరణ, చట్టపరమైన అనుమతుల ప్రక్రియలను ఒకేసారి ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని అధికారులు వివరించారు.

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పతిపాక జలాశయ ప్రాజెక్టుపై కూడా సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. 3 టీఎంసీలు, 5 టీఎంసీల సామర్థ్యాలతో రెండు ప్రత్యామ్నాయ నమూనాలను పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. లిడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ పూర్తయ్యాయని, భూగర్భ పరిశోధనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆగస్టు నెలాఖరులోపు డీపీఆర్ సమర్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు కాకతీయ ప్రధాన కాలువ పరిధిలోని సుమారు 2.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ కల్పించనున్నారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టుపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 96 శాతం పనులు పూర్తయ్యాయని, అటవీ అనుమతుల కారణంగా మిగిలిన పనులు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ అటవీకరణ కోసం భూమి గుర్తింపు పూర్తయ్యిందని, వన్యప్రాణి సంరక్షణ ప్రణాళికకు కూడా ఆమోదం లభించిందని వెల్లడించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ, పునరావాసం, అటవీ, పర్యావరణ అనుమతుల పెండింగ్ అంశాల జాబితాను సిద్ధం చేసి, వాటి పరిష్కారానికి గడువులు నిర్ణయించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల పూర్తి ద్వారా రైతులకు శాశ్వత ప్రయోజనాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# వరి సాగుపై మంత్రి హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ సాగునీటికి విడుదల చేసే పరిస్థితి లేదని, ప్రస్తుతం ఉన్న నీరు 2027 జూన్ వరకు తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో ప్రభావం దక్షిణ తెలంగాణపై తీవ్రంగా ఉండే అవకాశముందని మంత్రి హెచ్చరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోయాయని, బోర్లలో కూడా భూగర్భ జలాలు క్షీణిస్తున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలబడి పంటల మార్పిడిపై అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే 33 వేల ఎకరాల్లో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేసినట్లు వెల్లడించిన మంత్రి, దీన్ని లక్షన్నర ఎకరాలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకోవాలని అధికారులను ఆదేశించారు. కూరగాయలు, ఉద్యాన పంటలు, చిరుధాన్యాలు వంటి పంటలను ప్రోత్సహించాలని, సేంద్రియ వ్యవసాయంపై రైతులను చైతన్యపరచాలని సూచించారు. జిల్లాకు అవసరమైన 5 వేల స్ప్రింక్లర్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జిల్లాకు శాశ్వత సాగునీటి పరిష్కారంగా ఎస్ఎల్బీసీ సొరంగం పనులను ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని చెప్పారు. ఎస్ఎల్బీసీ, ఏఎంఆర్‌పీ, బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టుల ద్వారా భవిష్యత్తులో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా రాబోయే రోజుల్లో నీటి కొరత మరింత తీవ్రం కావచ్చని అభిప్రాయపడ్డారు. రైతులు ఆగస్టు 15లోపు ఆరుతడి పంటల సాగు చేపట్టేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు గ్రామాల స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.

# నీటి హక్కుల పరిరక్షణకు పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన యాగాలపై జరుగుతున్న విమర్శలను ప్రస్తావిస్తూ, దేశంలో కేసీఆర్ చేసినన్ని యాగాలు మరెవరూ చేసి ఉండరని కేటీఆర్ అన్నారు. యాగాలు, పూజలు అనేవి వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన అంశాలని, వాటిని రాజకీయ విమర్శల కోసం ఉపయోగించడం తగదన్నారు. దైవబలం కావాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, ప్రజల కోసం పనిచేసే సంకల్పంతో పాటు ఆధ్యాత్మిక విశ్వాసాలు కూడా సమాజంలో భాగమేనని పేర్కొన్నారు. యాగాలు నిర్వహించినందుకు విమర్శించడం కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని సూచించారు.

కాంగ్రెస్ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు దేవాలయాలను సందర్శించడం, పూజలు చేయడాన్ని కూడా రాజకీయ అంశంగా మార్చి విమర్శించడం దురదృష్టకరమన్నారు. ప్రజల విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపై ఉందని, మతపరమైన కార్యక్రమాలను కూడా రాజకీయ కోణంలో చూడడం సమంజసం కాదన్నారు. ప్రజా సమస్యలను పక్కనబెట్టి ఇలాంటి అంశాలపై రాజకీయ విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకుల అసహనాన్ని సూచిస్తోందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వ్యవసాయం, సాగునీరు, రైతాంగ సమస్యలపై ముఖ్యమంత్రికి సరైన అవగాహన లేదని ఆరోపించారు. పాలమూరు ప్రాంతానికి చెందిన వ్యక్తినని చెప్పుకునే ముఖ్యమంత్రి, అదే ప్రాంతానికి సాగునీరు అందించే విషయంలో విఫలమయ్యారని అన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, రైతులకు నీటి అందుబాటు, పంటల రక్షణ వంటి అంశాల్లో స్పష్టమైన కార్యాచరణ కనిపించడం లేదని అన్నారు.

'హైడ్రా' పేరుతో పేదలపై కక్షసాధింపు చర్యలు జరుగుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడం, వారిని ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ప్రజల హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, బలహీన వర్గాలపై ఒత్తిడి తీసుకురావడం సరైన పద్ధతి కాదన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జరగాలని, పేదల జీవితాలపై ప్రతికూల ప్రభావం పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తెలంగాణ శ్రేయస్సే తమ లక్ష్యమని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, నీటి హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే తెలంగాణ ఉద్యమ తరహాలో మరో భారీ ప్రజా పోరాటాన్ని చేపడతామని హెచ్చరించారు. కేసీఆర్ నాయకత్వంలో ప్రజలను చైతన్యపరిచి, రాష్ట్ర హక్కుల కోసం ఉద్యమిస్తామని తెలిపారు. తెలంగాణకు సంబంధించిన ప్రతి అంశంలో ప్రజల పక్షాన నిలుస్తామని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడే పోరాటంలో వెనక్కి తగ్గే ప్రసక్తే

# ఎస్ఐఆర్ ప్రక్రియపై బీజేపీ దృష్టి

**హైదరాబాద్, ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) రెండో విడత ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు మరింత అప్రమత్తంగా పనిచేయాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ వర్క్‌షాప్‌లో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బీజేపీ కార్యకర్తలు అహర్నిశలు శ్రమిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేస్తున్నారని రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి సరైన ఓటరు జాబితా అత్యంత కీలకమని అన్నారు.

తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమ వ్యక్తులకు వెనుకద్వార మార్గం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ల జారీ అనేక అనుమానాలకు తావిస్తోందని రామచందర్ రావు పేర్కొన్నారు. అక్రమ వ్యక్తులకు చట్టబద్ధత కల్పించే ప్రయత్నంగా ఇది కనిపిస్తోందని ఆరోపించారు. ఈ అంశంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయడంతో పాటు, అనుమానాస్పదమైన లేదా అనర్హమైన నమోదులను క్షుణ్ణంగా పరిశీలించాలని కార్యకర్తలకు సూచించారు. ఓటరు జాబితా స్వచ్ఛతను కాపాడేందుకు మరింత వేగంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కిషన్ రెడ్డి, రఘునందన్ రావు, గోడం నగేశ్‌తో పాటు బీజేపీ తెలంగాణకు చెందిన పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్



# పేరుకే 100 పడకల ఆసుపత్రి



- **పూర్తిస్థాయి వైద్య సేవలు, సిబ్బంది, పరికరాలు అందుబాటులోకి తేవాలి: మహేందర్ జీ**

**హుజురాబాద్, ఆగస్టు 8(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని బహుజన్ సమాజ్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు గిన్నారపు మహేందర్ డిమాండ్ చేశారు. ఆసుపత్రికి వంద పడకల హోదా ఉన్నప్పటికీ అందుకు అనుగుణంగా వైద్యులు, వైద్య సిబ్బంది, అవసరమైన పరికరాలు, మందులు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇరవై నాలుగు గంటల గంటల అత్యవసర వైద్య సేవలు సమర్థవంతంగా అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని మహేందర్ కోరారు. ముఖ్యంగా విషపదార్థాలు సేవించిన వారు, ప్రమాదాలు, ఇతర అత్యవసర కేసులతో ఆసుపత్రికి వచ్చే రోగులను అవసరం లేకపోయినా ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు రోగులు, వారి బంధువుల నుంచి వినిపిస్తున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన వారికి అక్కడే తగిన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న రోగులు

ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్య సేవలు అందడం లేదని కొందరు రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని మహేందర్ తెలిపారు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినప్పటికీ తగిన వైద్యం అందకపోవడంతో, ఆసుపత్రిలో చికిత్స పొందలేమని పేర్కొంటూ సంతకాలు చేసి బయటకు వెళ్లి ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని కొందరు రోగుల బంధువులు ఆరోపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

అదేవిధంగా ఆసుపత్రి సిబ్బంది కొందరు రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని మహేందర్ డిమాండ్ చేశారు.

గర్భిణులు, చిన్నారులకు మెరుగైన సేవలు అందించాలి

ఆసుపత్రిలో స్కానింగ్, ల్యాబ్ వంటి సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ, కొన్ని పరీక్షల కోసం రోగులను బయటకు పంపిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని మహేందర్ తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్నారులకు అవసరమైన పరీక్షలు, వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులు పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రధాన ఆధారమని, ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. వంద పడకల ఆసుపత్రికి అవసరమైన వైద్యులు, సిబ్బంది, పరికరాలు, మందులు సమకూర్చి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

హుజురాబాద్ ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ వైద్యం అందే వరకు ఈ సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నిస్తూనే ఉంటామని గిన్నారపు మహేందర్ స్పష్టం చేశారు.



# కృష్ణవేణి హైస్కూల్‌లో ఘనంగా గ్రీన్ డే వేడుకలు

- **విద్యార్థులతో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఆటపాటలు.. ఉత్సాహంగా పోటీలు**

**జవహర్ నగర్. ఆగస్ట్ 8(తెలంగాణ ముచ్చట్లు):** జవహర్‌నగర్: కీసర సర్కిల్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జన్మభూమి నగర్‌లో ఉన్న కృష్ణవేణి హైస్కూల్‌లో శనివారం గ్రీన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా పలు కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ సందర్భంగా పాఠశాల బాలబాలికలతో ప్రత్యేకంగా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొని తమ సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులతో ఆటపాటలు నిర్వహించి, వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. గ్రీన్ డే సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, పచ్చదనం ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రకృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో కృష్ణవేణి హైస్కూల్‌లో గ్రీన్ డే వేడుకలు సందడిగా సాగాయి.

# బోనాల జాతరలో శ్రీకాకతీయ విద్యార్థుల సందడి





- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఘనంగా బోనాల వేడుకలు**
- **పోతురాజుల వేషధారణలు, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణ**

**హుజురాబాద్, ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో కరికులం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకాకతీయ పాఠశాలలో బోనాల పండుగ వేడుకలు ఘనంగా, భక్తిశ్రద్ధల నడుమ కన్నులపండువగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించింది. పాఠశాల ప్రాంగణాన్ని తెలంగాణ పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా సర్వాంగ సుందరంగా అలంకరించారు.

వేడుకల్లో భాగంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తిశ్రద్ధలతో నైవేద్యాలతో కూడిన బోనాలను శిరస్సుపై ఎత్తుకుని పాఠశాల ప్రాంగణంలో ఊరేగింపుగా పాల్గొన్నారు. బోనాల ఊరేగింపు సందర్భంగా విద్యార్థుల ఉత్సాహం, సందడి పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నింపింది. పోతురాజుల వేషధారణలో విద్యార్థుల సందడి, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబించేలా చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల ఉత్సాహభరిత ప్రదర్శనలను చూసిన తల్లిదండ్రులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మాట్లా సందీప్ కుమార్, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ శ్రావంతి, డీన్ విజయ్, ప్రైమరీ ఇంచార్జ్ స్వాతితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మాట్లా సందీప్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు చిన్ననాటి నుంచే మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు కేవలం విద్యాబోధనే కాకుండా మన పండుగలు, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయడంలో పాఠశాల కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తెలంగాణకు ప్రత్యేకమైన బోనాల పండుగ విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యత, సాంస్కృతిక నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. వేడుకల ద్వారా విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల అవగాహన పెరగడంతో పాటు, సామూహికంగా పండుగలను నిర్వహించడం, సంస్కృతిని గౌరవించడం వంటి విలువలు పెంపొందుతాయని పాఠశాల యాజమాన్యం తెలిపింది. అనంతరం బోనాల వేడుకలను విజయవంతం చేసిన విద్యార్థులకు, కార్యక్రమం కోసం ప్రత్యేకంగా కృషి చేసిన ఉపాధ్యాయ బృందానికి, సహకరించిన తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. విద్యార్థుల సందడి, సాంస్కృతిక ప్రదర్శనలతో శ్రీకాకతీయ పాఠశాలలో బోనాల వేడుకలు ఉత్సాహభరితంగా ముగిశాయి.

# ఆర్టీఐ వ్యవస్థను బలోపేతం చేయాలి






- **జిల్లా స్థాయిలో కమిటీ, ఆర్టీఐ సహాయ కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతి**

**హుజురాబాద్ , ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు ):** సమాచార హక్కు చట్టం 2005ను జిల్లాస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు ఆర్టీఐ చట్టంపై పూర్తి అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక సమాచార హక్కు (ఆర్టీఐ) కమిటీని ఏర్పాటు చేయాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా కమిటీ కన్వీనర్ బండ నరేందర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

జిల్లా స్థాయిలో ఆర్టీఐ మానిటరింగ్ మెంబర్స్ వ్యవస్థను పునరుద్ధరించాలని, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఆర్టీఐ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నాయకులు కోరారు. ప్రజలకు సమాచార హక్కు చట్టంపై విస్తృత అవగాహన కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రస్తుతం సమాచార హక్కు చట్టం గురించి ప్రజల్లో పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో చాలామంది తమ హక్కును సమర్థవంతంగా వినియోగించుకోలేకపోతున్నారని బండ నరేందర్ తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ఆర్టీఐ చట్టం ఎంతో కీలకమన్నారు.

సమాచార హక్కు చట్టం సాధన కమిటీకి అధికారిక ప్రాతినిధ్యం కల్పించి, రాష్ట్ర ప్రభుత్వానికి మరియు తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌కు సిఫారసు చేయాలని ఆయన కోరారు. కమిటీకి కమిషన్‌లో సభ్యత్వం కల్పిస్తే ప్రజల్లో మరింత విస్తృతంగా అవగాహన కల్పించి, సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలను చైతన్యపరచగలమని తెలిపారు. తమ కమిటీకి ఈ అవకాశం తప్పనిసరిగా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, తిరగమల్ల నాగార్జున, కుమారస్వామి, రాజు, ప్రసాద్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిరు పేద వికలాంగుడి కుటుంబానికి అండగా నిలిచిన కొండల్ ముదిరాజ్






- **సమ్మయ్య దశదిన కార్యక్రమానికి సామగ్రి చేయూత**

**జవహర్‌నగర్, ఆగస్టు 8 ( తెలంగాణ ముచ్చట్లు):** జవహర్‌నగర్ 10వ డివిజన్‌కు చెందిన పేద వికలాంగుడు సమ్మయ్య కుటుంబానికి పలువురు నాయకులు అండగా నిలిచారు. స్పైనల్ కార్డ్ ఇంజురీ, బ్రెయిన్ ట్యూమర్‌తో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సమ్మయ్య గతవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించనున్న దశదిన కార్యక్రమానికి అవసరమైన సామగ్రిని శనివారం అందజేశారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ పలువురు దృష్టికి తీసుకువచ్చి తన వంతు సహాయంగా ఈ కార్యక్రమానికి సహకరించాలి అని అనడంతో శివకష్ణ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, వికలాంగుల సంఘాల ప్రతినిధులు తమ వంతు సహకారం ముందుకు వచ్చి అందించారు. జవహర్‌నగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్తడి సాయి, వికారాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మాయ బ్రహ్మ నరసింహ, సీనియర్ నాయకులు నాగులు ముదిరాజ్, సీనియర్ వికలాంగుల నాయకులు టైగర్ నరసింహ, ఎంపీ.ఆర్.డి మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గంగిరెడ్డి, ఎంపీ.ఆర్.డి సీనియర్ వికలాంగుల నాయకులు ధనరాజ్, రాజేందర్, నర్సింగరావు, అప్పారావు,రమేష్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రంగుల సతీష్, సీనియర్ జర్నలిస్ట గంగాధర్ చారి, బలగం టీవీ సీఈవో చింతల విజయ్ కుమార్, జినుక రఘు, తదితరులు పాల్గొన్నారు. వారి కుటుంబానికి వంట సామాగ్రి అందించడం జరిగింది ఈ సందర్భంగా కుటుంబానికి అండగా ఉంటామని కొండల్ ముదిరాజ్ మాట్లాడుతూ సమ్మయ్య కుటుంబాన్ని ఆదుకునేందుకు తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి దృష్టికి కుటుంబ పరిస్థితిని తీసుకెళ్లి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని, అలాగే సమ్మయ్య కుమార్తెల చదువుకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మెరుగు శివకృష్ణ అన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.1.20 లక్షల ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వేలేరు, ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రానికి చెందిన సింగం కేదారి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని ఆయన ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.1,20,000 ఎల్ఓసీ మంజూరు చేయించారు. హనుమకొండలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, కడియం శ్రీహరి,సింగం కేదారికి రూ.1.20 లక్షల ఎల్ఓసీ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, సర్పంచ్ బిల్లా యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

# హుజురాబాద్ బీసీ గురుకులంలో ఘనంగా బోనాల వేడుకలు



- **సాంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినుల సందడి.. అమ్మవారికి బోనాల సమర్పణ**

**హుజురాబాద్, ఆగస్టు 08 (తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర పండుగ బోనాల వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం భక్తిశ్రద్ధలతో, జాతర వాతావరణాన్ని తలపించేలా సందడిగా మారింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, పసుపు, కుంకుమ, వేపాకులతో ప్రత్యేకంగా అలంకరించిన బోనాలను ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థినులు బోనాలతో నిర్వహించిన ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ టి. శారద మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర పండుగైన బోనాలను పాఠశాల ఆవరణలో నిర్వహించి అమ్మవారికి బోనం సమర్పించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించినట్లు పేర్కొన్నారు.

పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించిన బోనాలను ఎత్తుకొని ఉపాధ్యాయులు, విద్యార్థినులు చేసిన ఊరేగింపు ఆకట్టుకుందని తెలిపారు. తెలంగాణ సంస్కృతిలో ఆడబిడ్డలకు ఉన్న ప్రత్యేక ప్రాధాన్యతను చాటేలా బోనాల వేడుకలను నిర్వహించామని ప్రిన్సిపల్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ నాగరాణి, బీ డబ్ల్యూ నీరజ, కే. రజిత, పీ. రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు సాగునీరు విడుదల చేయాలి

- **బీఆర్ఎస్ హెచ్చరికలతోనే పంపులు ప్రారంభించారు**
- **పెద్దమందడిలో బీఆర్ఎస్ నాయకుల ధ్వజం**



**పెద్దమందడి,ఆగస్టు08(తెలంగాణ ముచ్చట్లు):** కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ఎల్లూరు, జొన్నలబొగడ, గుడిపల్లి జలాశయాల నుంచి వెంటనే సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని పెద్దమందడి మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.మాజీ జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేణుయాదవ్, శ్రీనివాస్ గౌడ్ అల్వాల వెంకటరెడ్డి తదితరులు మాట్లాడుతూ.. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్యే మేఘారెడ్డికి లేదన్నారు. ప్రాజెక్టులు, సాగునీటి అంశాలపై అవగాహన లేకుండా ఎమ్మెల్యే ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాధించిన విజయమని పేర్కొన్నారు. జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తున్న నేపథ్యంలో ఎల్లూరు, జొన్నలబొగడ, గుడిపల్లి జలాశయాలను నింపి రైతులకు సాగునీరు అందించాలని కోరారు.బీఆర్ఎస్ నాయకులు నార్లాపూర్ జలాశయ ముట్టడికి హెచ్చరించిన తర్వాతే ప్రభుత్వం పంపులు ప్రారంభించిందని ఆరోపించారు. అయితే ఇప్పటికీ గుడిపల్లి జలాశయం నుంచి కాలువలకు నీరు విడుదల చేయలేదని, జొన్నలబొగడలో ఒక్క పంపు మాత్రమే పనిచేస్తోందని తెలిపారు. రైతులకు సాగునీరు అందించకుండా కేవలం తాగునీటి అవసరాల కోసం జలాశయాలను నింపే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని 500 చెరువులు, కుంటలను వెంటనే నింపి వానాకాలం, యాసంగి పంటలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పంపులను సుమారు 200 రోజుల పాటు నడిపే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. రైతులకు నీరు అందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సేనాపతి వెంకటయ్య, మనీగిళ్ల సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, అల్వాల వెంకటరెడ్డి, చిత్తూరు కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు, మలక్ సురేష్, రఘువర్ధన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, రమేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# కూతురి కాపురం కోసం తండ్రి చేసిన ప్రయత్నం విషాదాంతం



**వీణవంక, ఆగస్టు 08 (తెలంగాణ ముచ్చట్లు):** అదనపు కట్నం కోసం కుమార్తెను వేధిస్తున్న అల్లుడు, అత్తమామల తీరుతో మనస్తాపానికి గురైన తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది.

చల్లూరు గ్రామానికి చెందిన రామిడి వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. ఆమె కుమార్తెకు 2018లో అదే గ్రామానికి చెందిన లంబు శ్రీమాణికుమార్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నంగా ఎకరం 20 గుంటల భూమితో పాటు బంగారం, ఇతర సామగ్రి ఇచ్చినట్లు తెలిపారు. వారికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారని పేర్కొన్నారు.

గత మూడు, నాలుగు సంవత్సరాలుగా తన అల్లుడు మరో మహిళతో సంబంధం పెట్టుకుని కుమార్తెను శారీరకంగా, మానసికంగా వేధించేవాడని ఆరోపించారు. అదనంగా రూ.5 లక్షల కట్నం తీసుకురావాలని అల్లుడితో పాటు అతని తల్లి, తండ్రి వేధించేవారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వేధింపులు భరించలేక తన కుమార్తె గత రెండేళ్లుగా తమ ఇంటి వద్దే ఉంటోందని తెలిపారు.

ఈ సమస్య పరిష్కారం కోసం జూలై 29న గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలో తన భర్త సంజీవరెడ్డి అల్లుడు, అతని తల్లిదండ్రులను వేడుకుని తమ కుమార్తెను తిరిగి కాపురానికి తీసుకెళ్లాలని కోరినప్పటికీ వారు నిరాకరించారని పేర్కొన్నారు. పైగా తన భర్తను అవమానించేలా మాట్లాడారని ఆరోపించారు.

తరువాత ఆగస్టు 3న కూడా తన భర్త అల్లుడి ఇంటికి వెళ్లి కుమార్తెను కాపురానికి తీసుకెళ్లాలని వేడుకున్నారని, అక్కడ అల్లుడు, అతని తల్లిదండ్రులు మరోసారి అవమానించి కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన తన భర్త అదే రోజు రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగినట్లు తెలిపారు.

వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆగస్టు 7న రాత్రి మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

తన కుమార్తెను అదనపు కట్నం కోసం వేధించడంతో పాటు తన భర్త ఆత్మహత్యకు కారణమయ్యారని ఆరోపిస్తూ అల్లుడు లంబు శ్రీమాణికుమార్, అతని తల్లి మురోగతి, తండ్రి మల్లారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రామిడి వెంకటమ్మ పోలీసులను కోరారు.






# గ్రామస్తుల దరి చేరిన కార్పొరేట్ వైద్యం

- **వల్బాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం**

**వీణవంక, ఆగస్టు 08 (తెలంగాణ ముచ్చట్లు):** వీణవంక మండలం వల్బాపూర్ గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో, జమ్మికుంట ఆదిత్య అమృత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అందే శ్రీమతి కుమార్ మాట్లాడుతూ మారుతున్న ఆహారపు అలవాట్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కల్తీ ఆహార పదార్థాలకు దూరంగా ఉండడంతో పాటు ప్రతిరోజూ తగినంత నీరు తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు.వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ గ్రీష్మ మాట్లాడుతూ కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహారాన్ని తగ్గించి పోషక విలువలు కలిగిన సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. జంక్‌ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల యువతలో ఊబకాయం పెరుగుతోందని, బరువును నియంత్రించుకోవడం ముఖ్యమని తెలిపారు. ఆదిత్య ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఎలుక దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ బాలవికాస సంస్థ సమాజ సేవలో చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. గతంలో కూడా ఆదిత్య, అమృత ఆసుపత్రుల ఆధ్వర్యంలో పలు వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత పరీక్షలు, మందులు అందించినట్లు చెప్పారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు తమ సహకారం కొనసాగుతుందని తెలిపారు. వల్బాపూర్ గ్రామ ప్రజలకు తమ ఆసుపత్రిలో ఉచిత ఓపీ సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఉప సర్పంచ్ నామని విజేందర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామంలో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని ఇంటిని ఆరోగ్యానికి తొలి కేంద్రంగా మార్చుకోవాలని సూచించారు. బాలవికాస ఆధ్వర్యంలో 14 సెంటర్ల పరిధిలోని 180 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.2 కోట్ల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ స్వాతి, కరోబార్ రాజశేఖర్, పాలకవర్గ సభ్యులు, ఆదిత్య ఆసుపత్రి ప్రజా సంబంధాల అధికారులు రఫిక్, శ్రీకాంత్, దుర్గాప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది అనిల్‌రావు, మహేష్, శ్రావణ్, రంజిత్, పూజ, అనూష, శృతి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు.




# ప్రజలకు సమాచార హక్కుపై అవగాహన కల్పించాలి

**జమ్మికుంట, ఆగస్టు 08 (తెలంగాణ ముచ్చట్లు):** సమాచార హక్కు చట్టం-2005ను జిల్లాస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

కమిటీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా కమిటీ కన్వీనర్ బండ నరేందర్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి పలు డిమాండ్లను వినతిపత్రం ద్వారా తెలియజేశారు.

జిల్లా స్థాయిలో సమాచార హక్కు చట్టం సమర్థవంతమైన అమలుకు ప్రత్యేకంగా జిల్లా సమాచార హక్కు కమిటీ ఏర్పాటు చేయాలని, జిల్లా స్థాయి పర్యవేక్షణ సభ్యుల వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు. అలాగే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమాచార హక్కు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ప్రజలకు సమాచార హక్కు చట్టంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

సమాచార హక్కు చట్టం సాధన కమిటీకి అధికారిక ప్రాతినిధ్యం కల్పించి, రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌కు సిఫారసు చేయాలని కోరారు. ప్రజల్లో సమాచార హక్కు చట్టంపై పూర్తిస్థాయి అవగాహన లేకపోవడంతో కమిటీకి సమాచార కమిషన్‌లో సభ్యత్వం కల్పిస్తే మరింత మందిని చైతన్యవంతులను చేయగలమని తెలిపారు.

ప్రజలకు సమాచార హక్కు చట్టం ప్రయోజనాలు అందేలా తమ కమిటీకి అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బండ నరేందర్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, తిరగమల్ల నాగార్జున, కుమారస్వామి, రాజు, ప్రసాద్, మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## ప్రైవేట్ పాఠశాలల ఫీజులకు కళ్లెం వేయాలి

- **ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి: బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జేకే**



**జమ్మికుంట టౌన్ ఆగస్టు 08 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రైవేట్ పాఠశాలలు తమ ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగంగా ప్రకటించేలా తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినదని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జేకే అన్నారు.
విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలపై బీఆర్ఎస్వీ సంవత్సరాలుగా కొనసాగిస్తున్న నిరంతర పోరాటాలు, ప్రజాస్వామ్యబద్ధమైన శాంతియుత ఉద్యమాల ఫలితంగానే ఫీజుల పారదర్శకత దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తొలి అడుగుగా భావిస్తున్నామని తెలిపారు. అయితే కేవలం ఫీజుల వివరాలను ప్రదర్శించడం మాత్రమే సరిపోదని, ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచకుండా ప్రభుత్వం మరింత కఠినమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్య కోసం భరించలేని స్థాయిలో ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితిని నివారించేందుకు తెలంగాణ అసెంబ్లీలో ప్రత్యేకంగా 'ఫీజుల నియంత్రణ మరియు క్రమబద్ధీకరణ బిల్లు' ప్రవేశపెట్టి చట్టం చేయాలని కోరారు.
విద్య హక్కు.. వ్యాపారం కాదు అని స్పష్టం చేసిన జేకే, విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారాన్ని మోపడం అన్యాయమన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల వసూళ్లలో పూర్తి పారదర్శకత ఉండాలని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఫీజుల నియంత్రణకు సంబంధించి బీఆర్ఎస్వీ చేస్తున్న సూచనలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి అసెంబ్లీలో బలమైన చట్టాన్ని తీసుకురావాలని కోరారు. విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం, సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం మరింత ముందుకు సాగాలని సూచించారు. దశాబ్దాలుగా సాగుతున్న ప్రజాస్వామ్య పోరాటాలు, సమిష్టి గొంతుకలు, శాంతియుత ఉద్యమాలు ప్రభుత్వాలపై ప్రభావం చూపి అర్థవంతమైన మార్పును తీసుకురాగలవని ఈ పరిణామం మరోసారి నిరూపించిందన్నారు.
విద్యార్థులు, తల్లిదండ్రులకు న్యాయం జరిగే వరకు, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చే వరకు, అధిక ఫీజుల భారం తగ్గే వరకు బీఆర్ఎస్వీ పోరాటం కొనసాగుతుందని జేకే స్పష్టం చేశారు.

## ఆగస్టు 11న ఇందిరాపార్క్ వేదికగా ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల మహా ధర్నా

- **ఖాజా హుస్సేన్, ఎన్ హెచ్ ఎం జిల్లా కోఆర్డినేటర్**



**వనపర్తి,ఆగస్టు08(తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వేదికగా ఈ నెల 11వ తేదీ (మంగళవారం) ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల రాష్ట్రవ్యాప్త మహా ధర్నాను విజయవంతం చేయాలని వనపర్తి జిల్లా ఎన్‌హెచ్ఎం కోఆర్డినేటర్ ఖాజా హుస్సేన్ పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల క్రమబద్ధీకరణ (రెగ్యులరైజేషన్) ప్రధాన డిమాండ్‌తో ఎన్‌హెచ్ఎం జేఏసీ తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో ఈ మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు నిరంతరాయంగా వైద్య సేవలు అందిస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు ఉద్యోగ భద్రత లేకుండా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి రాష్ట్రంలోని ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరినీ ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.ఈ మహా ధర్నా పూర్తిగా శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతుందని, రాష్ట్రంలోని 78 క్యాడర్లకు చెందిన సుమారు 17 వేల మంది ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు.వనపర్తి జిల్లాలోని ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహా ధర్నాను విజయవంతం చేయాలని ఖాజా హుస్సేన్ కోరారు. అలాగే ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, వైద్య సంఘాలు, మీడియా ప్రతినిధులు, ప్రజలు ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు సంఘీభావం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

## బీఆర్ఎస్ నేత ఆరోగ్యంపై హరీశ్ రావు ఆరా

- **క్యామ మల్లేశ్‌ను కలిసిన మాజీ మంత్రి**



**హైదరాబాద్, ఆగస్టు 8 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న బీఆర్ఎస్ సీనియర్ నేత క్యామ మల్లేశ్‌ను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పరామర్శించారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని మల్లేశ్ నివాసానికి వెళ్లిన హరీశ్ రావు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు సూచించిన చికిత్స, ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులతో చర్చించారు. శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న మల్లేశ్ ఆరోగ్యంపై ప్రత్యేకంగా ఆరా తీశారు. వైద్యుల సూచనలను పాటిస్తూ విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.
బీఆర్ఎస్ పార్టీకి క్యామ మల్లేశ్ అందించిన సేవలను హరీశ్ రావు గుర్తు చేసుకున్నారు. పార్టీ బలోపేతంలో ఆయన పోషించిన పాత్రను ప్రస్తావిస్తూ త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకలాపాల్లో ఆయన మళ్లీ చురుకుగా పాల్గొనాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా మల్లేశ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారని తెలిపారు. కుటుంబ సభ్యులకు అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.
పరామర్శ సందర్భంగా పార్టీ నాయకులు, స్థానిక కార్యకర్తలు కూడా హాజరయ్యారు. మల్లేశ్ త్వరగా కోలుకుని మునుపటిలా ప్రజాసేవలో కొనసాగాలని వారు ఆకాంక్షించారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించినట్లు సమాచారం. బీఆర్ఎస్ నాయకత్వం పార్టీ సీనియర్ నేతల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఈ పరామర్శ మరోసారి స్పష్టం చేసింది. క్యామ మల్లేశ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరలోనే ప్రజల మధ్యకు రావాలని హరీశ్ రావు ఆకాంక్షించారు.

## ఎరుకల నాయకుడి అవమానాన్ని సహించం

- **మంగరాయి వెంకటేష్ రాజ్యాధికార పార్టీ దేవరకద్ర ఇంచార్జ్**



**మహబూబ్‌నగర్,ఆగస్టు08(తెలంగాణ ముచ్చట్లు):** ఎరుకల జాతి నాయకుడు, ఎల్‌బీనగర్ మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డా సత్యనారాయణను, ఆయన కుటుంబ సభ్యులను కులపరంగా కించపరిచేలా దూషించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి మంగరాయి వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ ఘటనకు సంబంధించినదిగా పేర్కొంటున్న ఆడియో వెలుగులోకి రావడం ఆందోళన కలిగించే విషయమన్నారు. కులపరంగా అవమానించేలా మాట్లాడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమైతే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వెంటనే స్పందించి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై పార్టీ పరంగా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కుల వివక్షను ప్రజాస్వామ్య సమాజం సహించదని అన్నారు.ఏకలవ్యుడి కాలం నుంచి నేటి వరకు ఎరుకల జాతి ప్రజలు సామాజిక, రాజకీయ వివక్షను ఎదుర్కొంటున్నారని మంగరాయి వెంకటేష్ అన్నారు. ఎరుకల సమాజానికి రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, చట్టసభలు, నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని, రాజకీయ పార్టీలను కోరారు .ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, కేసును నీరుగార్చే ప్రయత్నం జరిగితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని మంగరాయి వెంకటేష్ హెచ్చరించారు.

## 15 రోజుల తర్వాత దివ్యాంగుడు అఖిల్ ఆచూకీ లభ్యం

- **తల్లి ఒడికి చేర్చిన జవహర్‌నగర్ పోలీసులు**



**జవహర్ నగర్,ఆ గస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):** జవహర్‌నగర్: పదిహేను రోజుల క్రితం అదృశ్యమైన 24 ఏళ్ల దివ్యాంగుడు అఖిల్‌ను జవహర్‌నగర్ పోలీసులు ఎట్టకేలకు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. తమ బిడ్డ తిరిగి ఇంటికి చేరడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.గత నెల 26వ తేదీన అంబేద్కర్‌నగర్‌లోని తన నివాసం నుంచి బయటకు వెళ్లిన అఖిల్ తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు జవహర్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటనపై పలు వార్తా పత్రికలు, టీవీ చానళ్లలో కథనాలు ప్రసారం కావడంతో జవహర్‌నగర్ ఠాణా సీఐ సైదులు స్పందించి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.అఖిల్‌కు తన పేరు, చిరునామా లేదా తల్లిదండ్రుల ఫోన్ నంబర్ చెప్పే పరిస్థితి లేకపోవడంతో అతని ఆచూకీ కనుగొనడం పోలీసులకు సవాల్‌గా మారింది. దీంతో అంబేద్కర్‌నగర్ నుంచి బోయిన్‌పల్లి వరకు సుమారు 100కు పైగా సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. అఖిల్ ఆ ప్రాంతాల్లోనే తిరుగుతున్నట్లు గుర్తించి గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశారు.ఇదిలా ఉండగా, పోలీసులు మున్సిపల్ సిబ్బందికి కూడా అఖిల్ వివరాలను చేరవేశారు. ఈ క్రమంలో శనివారం ఉదయం బాలానగర్‌లో అర్ధనగ్నంగా తిరుగుతున్న అఖిల్‌ను గుర్తించిన మున్సిపల్ సిబ్బంది వెంటనే జవహర్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే సీఐ సైదులు ప్రత్యేక బృందాన్ని బాలానగర్‌కు పంపించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు అఖిల్‌కు దుస్తులు అందించి, అతడిని సురక్షితంగా కారులో పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం అఖిల్‌ను అతని తల్లిదండ్రులకు అప్పగించారు.
పదిహేను రోజుల తర్వాత తమ కుమారుడు క్షేమంగా తిరిగి రావడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అఖిల్ ఆచూకీ కోసం సహకరించిన పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి





- **మంత్రులకు వినతి పత్రం అందించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**
- **సానుకూలంగా స్పందించిన మంత్రులు**

**హుజురాబాద్ , ఆగస్టు 8(తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పరిష్కరించడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాష్ట్ర మంత్రులను కోరారు. డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించగా, ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని హుజురాబాద్ నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు.
మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే నియోజకవర్గంలోని సమస్యలపై విస్తృతంగా వివరించారు.

**కాల్వల ప్రాజెక్టుకు రూ.డెబ్బై కోట్లు ఇవ్వాలి**

ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి కాల్వల ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు రూ.డెబ్బై కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అలాగే పేలుళ్ల కారణంగా దెబ్బతిన్న తనుగుల చెక్‌డ్యామ్‌కు తక్షణమే మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలని, కన్నెపల్లి పంపులను వెంటనే ఆన్ చేసి హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగునీరు అందించాలని కోరారు.

**ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి.**

కరీంనగర్ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉన్న ఇల్లంతకుంట శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ అభివృద్ధికి రూ.30 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే కమలాపూర్ పెద్దమ్మతల్లి ఆలయ అభివృద్ధికి రూ.ఇరవై కోట్లు మంజూరు చేయాలని మంత్రులకు విజ్ఞప్తి చేశారు.

**రహదారులు, మున్సిపాలిటీలకు నిధులు**

వీణవంక మండలంలోని డబుల్ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరిన ఎమ్మెల్యే, హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలకు గతంలో మంజూరైన రూ.పదిహేను కోట్ల చొప్పున నిధులతో పనులు ప్రారంభించాలని కోరారు. జమ్మికుంట, హుజురాబాద్ పట్టణాల్లో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణ పనులు సుమారు ఎనభై శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను పూర్తి చేసేందుకు రెండు పట్టణాలకు రూ.రెండు కోట్ల చొప్పున నిధులు అవసరమని తెలిపారు. జమ్మికుంట పట్టణంలో వంద శాతం ట్యాక్స్ కలెక్షన్ సాధించినందుకు ఇన్సెంటివ్‌గా రావాల్సిన రూ.మూడు కోట్లను విడుదల చేయాలని కోరారు.

**ఇసుక ధరలు తగ్గించాలి.. ట్రాక్టర్లకు ఆన్‌లైన్ విధానం తొలగించాలి**

నియోజకవర్గంలో ఇసుక రవాణా కారణంగా రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ఇసుక లభ్యత ఉన్నప్పటికీ రూ.పదిహేను వందలకు లభించాల్సిన ఇసుక రూ.ఏడువేల అయిదువందల వరకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి, మానకొండూర్ నియోజకవర్గాల్లో అమలు చేస్తున్న విధానం మాదిరిగా హుజురాబాద్ నియోజకవర్గంలోనూ ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపునకు ఆన్‌లైన్ విధానం లేకుండా అనుమతులు కల్పించాలని కోరారు. దీనివల్ల ప్రజలకు తక్కువ ధరకు ఇసుక అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

**బీపీ, షుగర్ మందులు అందుబాటులోకి తేవాలి**

జమ్మికుంట మండలంలో బీపీ, షుగర్ మందులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. వెంటనే అవసరమైన మందులను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కమలాపూర్ బస్టాండ్‌కు హాస్పిటల్ స్థలం కేటాయించాలని కూడా విజ్ఞప్తి చేశారు.

**దళిత బంధు, ఇందిరమ్మ ఇళ్లపై విజ్ఞప్తి**

దళిత బంధు రెండో విడత నిధులను విడుదల చేయాలని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. సైదాబాద్‌లో ఇళ్ల పట్టాలను తిరిగి ఇవ్వాలని, హుజురాబాద్ మీడియా మిత్రులకు గతంలో ఇచ్చిన పట్టాలను రద్దు చేసిన నేపథ్యంలో వాటిని తిరిగి ఇవ్వాలని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రద్దు చేసిన కొన్ని ప్రొసీడింగ్స్‌ను కూడా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

**శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

కరీంనగర్ జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన పాడి కౌశిక్ రెడ్డి, దొంగతనాలు, హత్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం లా అండ్ ఆర్డర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజలకు భద్రత కల్పించేలా పోలీసు శాఖకు అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

**సానుకూలంగా స్పందించిన మంత్రులు**

హుజురాబాద్ నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మంత్రులకు వినతిపత్రం అందించారు. నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు, అభివృద్ధి పనులపై మంత్రులు సానుకూలంగా స్పందించి, అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.
ఈ సమీక్షా సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సాగునీటిపై నిరంజన్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

- **ఆగస్టు 1 నుంచే కాలువలకు సాగునీటి విడుదల**
- **వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి**



**వనపర్తి,ఆగస్టు08(తెలంగాణ ముచ్చట్లు):** రైతులకు సాగునీరు అందడం లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు. క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు.ఆగస్టు 1 నుంచే లిఫ్ట్1, లిఫ్ట్2 ద్వారా నీటి ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు శ్రీశైలం నుంచి 2.7 టీఎంసీల నీటిని ఎత్తిపోసినట్లు చెప్పారు. ఎల్లూరు రిజర్వాయర్‌లో 0.34 టీఎంసీలు, సింగోటం రిజర్వాయర్‌లో 0.40 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు.జొన్నలబొగడ రిజర్వాయర్‌లో 1.753 టీఎంసీల నీరు ఉందని, మూడు పంపుల ద్వారా 2,400 క్యూసెక్కుల నీరు వస్తుండగా, 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. కల్వకుర్తి ఎడమ కాలువకు కూడా 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ఆగస్టు 6న లిఫ్ట్3ను ప్రారంభించామని, గుడిపల్లిగట్టు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.42 టీఎంసీల నీరు ఉందని వివరించారు.ఆగస్టు 7న అన్ని కాలువలకు సాగునీటిని విడుదల చేశామని, ఆగస్టు 8న గుడిపల్లి రిజర్వాయర్ వద్ద గేట్లు ఎత్తి నీటిని కాలువలకు విడుదల చేసినట్లు మేఘా రెడ్డి తెలిపారు.మోటర్లు ఆన్ చేయలేదని, రైతులకు నీరు ఇవ్వడం లేదని చెప్పడం వాస్తవాలను వక్రీకరించడమేనని అన్నారు. పంపులు ఎప్పుడు ప్రారంభించామో, ఎంత నీటిని ఎత్తిపోశామో, రిజర్వాయర్లలో ఎంత నీరు ఉందో లెక్కలతో సహా వెల్లడిస్తున్నామని చెప్పారు.రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. రాజకీయ విమర్శలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని మేఘా రెడ్డి సూచించారు.



# చంద్రపురికాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

- **పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షుడు వజ్రష్ యాదవ్**




**జవహర్ నగర్, ఆగస్టు 8, (తెలంగాణ ముచ్చట్లు):**ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజా సంక్షేమం కోసమే పనిచేస్తుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. శనివారం చంద్రపురికాలనీ డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ మొగిలిపాక పరశురాం, టీఆర్ఎస్వీ అధ్యక్షుడు నర్ర మహేష్, రాహుల్ కథమ్, బబ్లూ ముదిరాజ్ అనుచరులతో పాటు ఇతర నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ లో చేరారు. మొదటగా బాలాజీనగర్ నుండి బైక్ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం చంద్రపురికాలనీలోని కమ్యూనిటీ హాల్లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ జవహర్ నగర్ లో 210 కోట్లతో ఇంటిగ్రేటేడ్ పాఠశాల, సుమారు 50 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంబం కానున్నాయన్నారు. జవహర్ నగర్, చంద్రపురికాలనీ అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. మరో రూ.5 కోట్లతో డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. పాత ఇండ్లను కూల్చి నూతనంగా నిర్మించుకునే వారు మండల తాసిల్దార్ కు ధరఖాస్తు చేసుకుంటే ఎటువంటి ఇబ్బందులు రానివ్వమన్నారు. ఇప్పటికే 100 ఫీట్ల ప్రధాన రహదారి పనులు జరుగుతున్నాయని త్వరలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నామన్నారు. ప్రతీ కాలనీలో మట్టిరోడ్డు లేకుండా చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షురాలు శాంతికోటేష్, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి సదానంద్, రాష్ట్ర మహిళా కార్యదర్శి అనంతలక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ ఈగ స్వేతరాజు ముదిరాజ్, మాజీ కార్పోరేటర్లు వేణు, కుతాడి శ్రీకాంత్, సాయికుమార్, నాయకులు బల్లి శ్రీనివాస్, వినయ్, మిట్టూ యాదవ్, రజితగోపాల్, బూడిద వెంకటేష్, కారింగుల రాజుగౌడ్, చిట్టిబాబు, రమేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల అస్తిత్వానికి ప్రపంచ వేదిక

- **ప్రకృతి సంరక్షణలో అపూర్వ పాత్ర**
- **సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ అవసరం**
- **సమాన హక్కుల సాధనకు సంకల్పం**

**డెస్క్, ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా నివసిస్తున్న ఆదివాసీ ప్రజల హక్కులు, సంస్కృతి, భాషలు, సంప్రదాయాలు, జీవన విధానాల పరిరక్షణకు గుర్తింపుగా ప్రతి సంవత్సరం ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీ ప్రజల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరుపుకునే ఈ ప్రత్యేక దినం ఆదివాసీ సమాజాల చరిత్ర, వారసత్వం, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రపంచ దృష్టికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఆధునిక నాగరికత వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో కూడా తమ ప్రత్యేక గుర్తింపును కాపాడుకుంటూ జీవిస్తున్న ఆదివాసీ సమాజాలు మానవ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించాయి. ప్రపంచ జనాభాలో సుమారు ఐదు శాతం మాత్రమే ఆదివాసీలు ఉన్నప్పటికీ, భూమిపై ఉన్న సాంస్కృతిక వైవిధ్యంలో వారి పాత్ర అత్యంత ప్రాధాన్యమైనది. ప్రపంచంలోని వేలాది భాషలు, సంప్రదాయాలు, జీవన శైలులు ఆదివాసీ సమాజాల ద్వారా ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. ప్రతి తెగకు ప్రత్యేకమైన ఆచారాలు, పండుగలు, విశ్వాసాలు ఉండడం మానవ నాగరికతకు గొప్ప సంపదగా భావించబడుతోంది. ఈ వారసత్వం కేవలం ఒక సమాజానిదే కాకుండా మొత్తం ప్రపంచానిదని నిపుణులు పేర్కొంటున్నారు.

ఆదివాసీ ప్రజల జీవన విధానం ప్రకృతితో విడదీయరాని బంధాన్ని కలిగి ఉంటుంది. అడవులు, కొండలు, నదులు, వన్యప్రాణులు, ఔషధ మొక్కలు వంటి సహజ వనరులను వారు కేవలం వినియోగించడమే కాకుండా సంరక్షిస్తారు కూడా. ప్రకృతి సమతుల్యతను కాపాడే విషయంలో ఆదివాసీ సమాజాల సంప్రదాయ జ్ఞానం అమూల్యమైనదిగా గుర్తించబడింది. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న వాతావరణ మార్పులు, పర్యావరణ సంక్షోభాల నేపథ్యంలో వారి అనుభవాలు, విధానాలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. భారతదేశంలో ఆదివాసీలు దేశ సాంస్కృతిక నిర్మాణంలో కీలక భాగస్వాములుగా ఉన్నారు. గోండులు, కొయలు, చెంచులు, సవరలు, కొండరెడ్డిలు, లంబాడీలు వంటి అనేక గిరిజన తెగలు తమ ప్రత్యేక జీవన విధానాలను కొనసాగిస్తూ వస్తున్నారు. వారి జానపద కళలు, నృత్యాలు, గీతాలు, హస్తకళలు, సంప్రదాయ వైద్య పద్ధతులు భారతీయ సంస్కృతిని మరింత సమృద్ధిగా చేస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ వారి సంప్రదాయ పండుగలు వైభవంగా నిర్వహించబడుతున్నాయి.

తెలంగాణలో కూడా గిరిజన సమాజాలు రాష్ట్ర సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో గిరిజన జనాభా అధికంగా ఉంది. ఈ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు అడవుల సంరక్షణతో పాటు వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. వారి సంప్రదాయ జ్ఞానం ప్రకృతి పరిరక్షణకు ఎంతో ఉపయోగపడుతోంది. అయితే అభివృద్ధి పేరుతో అనేక ఆదివాసీ ప్రాంతాలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. గనుల తవ్వకాలు, పరిశ్రమలు, భారీ ప్రాజెక్టుల కారణంగా కొన్నిచోట్ల గిరిజన కుటుంబాలు తమ నివాస ప్రాంతాలను కోల్పోవాల్సి వస్తోంది. భూమి హక్కులు, అటవీ హక్కులు, జీవనోపాధి భద్రత వంటి అంశాలు ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో ప్రధాన సమస్యలుగా కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితులు ఆదివాసీ సమాజాల అస్తిత్వానికే సవాలుగా మారుతున్నాయి.

విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల విషయంలో కూడా అనేక గిరిజన ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయి. ప్రభుత్వాలు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ, కొండ ప్రాంతాలు మరియు మారుమూల గ్రామాలకు సేవలు పూర్తిస్థాయిలో చేరడం లేదు. విద్యా సదుపాయాల లేమి కారణంగా అనేక మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ఆరోగ్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల కూడా పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆదివాసీ భాషల పరిరక్షణ ప్రస్తుతం అత్యంత కీలకమైన అంశంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా అనేక గిరిజన భాషలు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. భాష కోల్పోతే ఆ సమాజ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయ జ్ఞానం కూడా కనుమరుగయ్యే ప్రమాదం ఉంటుంది. అందుకే గిరిజన భాషల బోధన, పరిశోధన, ప్రచారం కోసం ప్రత్యేక చర్యలు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

ఆదివాసీ యువత ప్రస్తుతం విద్య, ఉద్యోగాలు, సాంకేతిక పరిజ్ఞానం వైపు అడుగులు వేస్తున్నప్పటికీ తమ మూలాలను మరచిపోకుండా ముందుకు సాగుతున్నారు. సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతూ, తమ హక్కుల సాధన కోసం చైతన్యవంతంగా పనిచేస్తున్నారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక వర్గాలు కలిసి ఆదివాసీ యువతకు మరిన్ని అవకాశాలు కల్పిస్తే వారు దేశ అభివృద్ధిలో మరింత కీలక పాత్ర పోషించగలరు. అంతర్జాతీయ ఆదివాసీ ప్రజల దినోత్సవం ప్రపంచానికి ఒక ముఖ్యమైన సందేశాన్ని అందిస్తోంది. ప్రకృతిని కాపాడే, సంస్కృతిని సంరక్షించే, సమానత్వాన్ని కోరుకునే ఆదివాసీ సమాజాల హక్కులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా చేరేలా చూడడం, వారి సంస్కృతి, భాషలు, జీవన విధానాలను రక్షించడం ద్వారానే నిజమైన సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆదివాసీల అస్తిత్వాన్ని గౌరవిస్తూ వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడం ఈ దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యంగా నిలుస్తోంది.





# ఆటో కార్మికులకు రామన్న భరోసా

- **సిరిసిల్లలో ఆటో కార్మికులందరికీ ప్రమాద బీమా**
- **మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం**
- **కేటీఆర్ ముందుచూపుపై కార్మికుల ప్రశంసలు**
- **ఆపదలో కుటుంబాలకు ఆర్థిక అండగా బీమా పథకం**

**సిరిసిల్ల, ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):** రోజంతా శ్రమించి కుటుంబాలను పోషిస్తున్న ఆటో కార్మికుల భద్రత కోసం చేపట్టిన ప్రమాద బీమా పథకం మరో కుటుంబానికి ఆర్థిక అండగా నిలిచింది. సిరిసిల్ల జిల్లాలోని ఆటో కార్మికులందరికీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన సొంత వ్యయంతో ప్రమాద బీమా చేయించగా, ఇటీవల ప్రమాదంలో మరణించిన ఓ ఆటో కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందింది. దీంతో ఆ కుటుంబానికి కష్టకాలంలో ఆర్థిక భరోసా లభించింది. బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు బొమ్మనవేని రాజు సుమారు నాలుగు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న రాజు మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కుటుంబ పోషణతో పాటు భవిష్యత్ జీవనంపై ఆందోళన నెలకొన్న సమయంలో ముందుగానే తీసుకున్న ప్రమాద బీమా వారికి అండగా నిలిచింది.

కేటీఆర్ చేపట్టిన బీమా పథకం కింద రాజు కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందజేశారు. ప్రమాదం జరిగిన తర్వాత కుటుంబం ఆర్థికంగా చితికిపోకుండా ఉండేందుకు ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా మారిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. కార్మికుల జీవితాల్లో ఎలాంటి ప్రమాదం ఎదురైనా వారి కుటుంబాలకు కనీస ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఈ బీమా పథకాన్ని అమలు చేసినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు కేటీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సొంత ఖర్చుతో ప్రమాద బీమా చేయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన కుటుంబానికి వెంటనే బీమా ప్రయోజనం అందడం వల్ల ఈ పథకం ప్రాముఖ్యత మరింత స్పష్టమైందని చెప్పారు. కార్మికుల పట్ల చూపుతున్న శ్రద్ధను వారు కొనియాడారు. పరిహారం అందజేసిన కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సంక్షేమానికి పార్టీ అండగా ఉంటుందని నాయకులు హామీ ఇచ్చారు. కార్మిక వర్గాల భద్రత, సంక్షేమం కోసం సామాజిక బాధ్యతతో చేపట్టిన ఈ తరహా కార్యక్రమాలు మరింత విస్తరించాలని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రమాదాలు ముందస్తు హెచ్చరిక లేకుండా సంభవించే పరిస్థితుల్లో బీమా పథకాలు కుటుంబాలకు కీలక రక్షణ కవచంగా నిలుస్తాయని పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లాలో అమలవుతున్న ఈ కార్యక్రమం ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందని స్థానికులు తెలిపారు.





# డేటింగ్ యాప్‌ల ముసుగులో మోసాల ముప్పు

- **పరిచయాల పేరుతో బ్లాక్‌మెయిల్ దందా**
- **వ్యక్తిగత వివరాలు పంచుకుంటే ప్రమాదమే**
- **దేశవ్యాప్తంగా పెరుగుతున్న సైబర్ ఉచ్చులు**
- **అప్రమత్తతే రక్షణ అంటున్న నిపుణులు**

**డెస్క్, ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):** డిజిటల్ యుగంలో డేటింగ్ యాప్‌లు, సామాజిక మాధ్యమాలు కొత్త పరిచయాలకు వేదికలుగా మారుతున్నప్పటికీ, వాటి ముసుగులో జరుగుతున్న మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో వెలుగులోకి వచ్చిన ఘటనలో పల్లవి సింగ్ రాజ్‌పుత్ అనే మహిళ డేటింగ్ యాప్‌ల ద్వారా పురుషులతో పరిచయాలు పెంచుకుని, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను అడ్డం పెట్టుకుని కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు రావడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు కొత్త పద్ధతులతో అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారు. మొదట స్నేహం పేరుతో నమ్మకం సంపాదించి, తర్వాత వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడం, రహస్యంగా చిత్రాలు లేదా వీడియోలు రికార్డు చేయడం, అనంతరం వాటిని బహిర్గతం చేస్తామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేయడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. పరువు నష్టం భయంతో చాలామంది బాధితులు ఫిర్యాదు చేయకుండా మౌనంగా డబ్బులు చెల్లిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా డేటింగ్ యాప్‌లు, సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వ్యక్తుల గురించి పూర్తి అవగాహన లేకుండానే వ్యక్తిగత వివరాలు, కుటుంబ సమాచారం, బ్యాంకు వివరాలు లేదా వ్యక్తిగత ఫొటోలు పంచుకోవడం ప్రమాదకరంగా మారుతోంది. ఒక్కసారి సమాచారం నేరగాళ్ల చేతికి చేరితే దానిని బ్లాక్‌మెయిలింగ్‌కు ఉపయోగించే అవకాశాలు అధికంగా ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవలి కాలంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇలాంటి కేసులు నమోదవుతున్నాయి. నకిలీ పేర్లు, తప్పుడు గుర్తింపులతో పరిచయాలు పెంచుకుని మోసాలకు పాల్పడే ముఠాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కొత్త కొత్త మార్గాలు అనుసరిస్తున్నాయి. యువతతో పాటు ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, వృత్తి నిపుణులు కూడా ఈ ఉచ్చుల్లో చిక్కుకుంటున్న ఘటనలు నమోదవుతున్నాయి. సందేహాస్పదంగా ప్రవర్తించే వ్యక్తులు డబ్బులు అడిగినా, బెదిరింపులకు పాల్పడినా వెంటనే పోలీసులను లేదా సైబర్ క్రైమ్ విభాగాన్ని సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. భయపడి డబ్బులు చెల్లించడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తుందని చెబుతున్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవడం, వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోవడం అత్యంత అవసరమని పేర్కొంటున్నారు. సాంకేతికతను వినియోగించే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అపరిచితులతో వ్యక్తిగత విషయాలు పంచుకోకుండా, ఆన్‌లైన్ పరిచయాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తే ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండవచ్చని చెబుతున్నారు. డిజిటల్ ప్రపంచంలో జాగ్రత్తే ఉత్తమ రక్షణ అని హెచ్చరిస్తున్నారు.



# స్వేచ్ఛకు దారి చూపిన ఆగస్టు క్రాంతి


- **బానిసత్వపు సంకెళ్లను తెంచుకున్న జాతి**
- **త్యాగాల చరిత్రను మరువరాదు**
- **ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే నిజమైన నివాళి**

**డెస్క్, ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):** భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఆగస్టు క్రాంతి ఉద్యమం ఒక యుగాంతర ఘట్టంగా నిలిచింది. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఇచ్చిన "భారత్ విడిచి పో" పిలుపు కేవలం ఒక రాజకీయ నినాదం మాత్రమే కాదు, స్వేచ్ఛ కోసం ఆరాటపడుతున్న కోట్లాది భారతీయుల మనసుల్లో జ్వాలలు రగిలించిన మహా ఉద్యమానికి నాంది. బ్రిటిష్ పాలనను సవాలు చేస్తూ దేశం మొత్తం ఒకే స్వరంతో స్వాతంత్ర్యం కోసం పోరాడిన అరుదైన సందర్భం అది. భారత స్వేచ్ఛా గాథలో ఆ ఉద్యమానికి ప్రత్యేకమైన స్థానం ఉండటానికి ఇదే కారణం. స్వాతంత్ర్యం అనేది ఒక రోజులో లభించిన వరం కాదు. అనేక దశాబ్దాల పోరాటాలు, వేలాది మంది త్యాగాలు, లెక్కలేనన్ని కష్టనష్టాల ఫలితంగా దేశం స్వేచ్ఛను పొందింది. ఆ పోరాటంలో ఆగస్టు క్రాంతి ఉద్యమం కీలక మలుపుగా నిలిచింది. నాయకులను అరెస్టు చేసినా, ఉద్యమాన్ని అణచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకున్నా ప్రజలు వెనుకడుగు వేయలేదు. నాయకత్వం లేకపోయినా స్వాతంత్ర్య జ్యోతి ఆరిపోకుండా ప్రజలే ఉద్యమాన్ని ముందుకు నడిపించడం భారత జాతి సంకల్పానికి నిదర్శనం. ఈ ఉద్యమం భారతీయులకు ఒక గొప్ప పాఠాన్ని నేర్పింది. ప్రజలు ఏకమైతే ఎంతటి శక్తివంతమైన పాలననైనా ఎదుర్కొనగలరని నిరూపించింది. ప్రాంతాలు, భాషలు, మతాలు, వర్గాల భేదాలను పక్కనపెట్టి దేశ స్వేచ్ఛ కోసం ప్రజలు ఒకే లక్ష్యంతో ముందుకు సాగారు. ఆ ఐక్యతే చివరకు స్వాతంత్ర్య సాధనకు బలమైన పునాదిగా మారింది. నేటి తరానికి కూడా ఈ సందేశం ఎంతో అవసరం. ఆగస్టు క్రాంతి దినోత్సవం మనకు స్వేచ్ఛ విలువను గుర్తు చేస్తుంది. ప్రస్తుతం మనం అనుభవిస్తున్న ప్రజాస్వామ్యం, ఓటు హక్కు, భావ ప్రకటనా స్వేచ్ఛ, అభివృద్ధి అవకాశాలు అన్నీ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమే. కానీ కాలక్రమేణా స్వాతంత్ర్య పోరాట చరిత్ర కొత్త తరాలకు దూరమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. చరిత్రను తెలుసుకోవడం, స్వాతంత్ర్య ఉద్యమం వెనుక ఉన్న విలువలను అర్థం చేసుకోవడం సమాజ బాధ్యతగా మారాలి. ప్రజాస్వామ్య వ్యవస్థ బలపడాలంటే పౌరుల్లో బాధ్యతాయుతమైన చైతన్యం అవసరం. స్వాతంత్ర్యం సాధించిన తర్వాత కూడా దేశ నిర్మాణం అనే మహత్తర బాధ్యత కొనసాగుతూనే ఉంటుంది. అవినీతి, అసమానతలు, సామాజిక విభేదాలు, పర్యావరణ సంక్షోభాలు వంటి సమస్యలను ఎదుర్కొంటూ దేశాన్ని ముందుకు తీసుకెళ్లడం ప్రతి పౌరుడి కర్తవ్యం. స్వాతంత్ర్య సమరయోధులు కలగన్న సమానత్వ సమాజం నిర్మాణమే వారికి అందించే నిజమైన నివాళి. నేడు ఆగస్టు క్రాంతి దినోత్సవాన్ని జరుపుకోవడం అంటే కేవలం చరిత్రను స్మరించుకోవడం కాదు. స్వేచ్ఛ కోసం పోరాడిన మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టడం. ప్రజాస్వామ్య విలువలను కాపాడడం. దేశ ఐక్యతను బలోపేతం చేయడం. జాతి ప్రయోజనాలను వ్యక్తిగత ప్రయోజనాల కంటే ఉన్నతంగా భావించడం. ఈ స్ఫూర్తిని ప్రతి తరం అందిపుచ్చుకున్నప్పుడే ఆగస్టు క్రాంతి ఉద్యమం సార్థకమవుతుంది. స్వేచ్ఛను సాధించిన జాతిగా మాత్రమే కాకుండా, స్వేచ్ఛను సద్వినియోగం చేసుకునే బాధ్యతాయుతమైన సమాజంగా ఎదగడమే ఆ ఉద్యమం మనకు అందించే శాశ్వత సందేశం. ప్రజాస్వామ్య వ్యవస్థ

బలపడాలంటే పౌరుల్లో బాధ్యతాయుతమైన చైతన్యం అవసరం. స్వాతంత్ర్యం సాధించిన తర్వాత కూడా దేశ నిర్మాణం అనే మహత్తర బాధ్యత కొనసాగుతూనే ఉంటుంది. అవినీతి, అసమానతలు, సామాజిక విభేదాలు, పర్యావరణ సంక్షోభాలు వంటి సమస్యలను ఎదుర్కొంటూ దేశాన్ని ముందుకు తీసుకెళ్లడం ప్రతి పౌరుడి కర్తవ్యం. స్వాతంత్ర్య సమరయోధులు కలగన్న సమానత్వ సమాజం నిర్మాణమే వారికి అందించే నిజమైన నివాళి. నేడు ఆగస్టు క్రాంతి దినోత్సవాన్ని జరుపుకోవడం అంటే కేవలం చరిత్రను స్మరించుకోవడం కాదు. స్వేచ్ఛ కోసం పోరాడిన మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టడం. ప్రజాస్వామ్య విలువలను కాపాడడం. దేశ ఐక్యతను బలోపేతం చేయడం. జాతి ప్రయోజనాలను వ్యక్తిగత ప్రయోజనాల కంటే ఉన్నతంగా భావించడం. ఈ స్ఫూర్తిని ప్రతి తరం అందిపుచ్చుకున్నప్పుడే ఆగస్టు క్రాంతి ఉద్యమం సార్థకమవుతుంది. స్వేచ్ఛను సాధించిన జాతిగా మాత్రమే కాకుండా, స్వేచ్ఛను సద్వినియోగం చేసుకునే బాధ్యతాయుతమైన సమాజంగా ఎదగడమే ఆ ఉద్యమం మనకు అందించే శాశ్వత సందేశం.

# నాగసాకి విషాదం.. మానవాళికి శాశ్వత హెచ్చరిక

- **అణ్వస్త్రాల విధ్వంసానికి నిదర్శనం**
- **యుద్ధాల మూల్యం ఎంత భయంకరమో తెలిపిన ఘటన**
- **శాంతి, సహజీవనమే ప్రపంచానికి మార్గం**
- **మానవత్వ పరిరక్షణకు నాగసాకి సందేశం**



**డెస్క్, ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ చరిత్రలో అత్యంత విషాదకరమైన సంఘటనల్లో నాగసాకి అణుబాంబు దాడి ఒకటి. రెండో ప్రపంచ యుద్ధం చివరి దశలో 1945 ఆగస్టు 9న జపాన్‌లోని నాగసాకి నగరంపై అమెరికా అణుబాంబు ప్రయోగించింది. క్షణాల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోగా, లక్షలాది మంది జీవితాలు శాశ్వతంగా మారిపోయాయి. ఈ ఘటనను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం నాగసాకి దినాన్ని నిర్వహిస్తారు. అణ్వస్త్రాల వినాశకర శక్తిని ప్రపంచానికి గుర్తు చేస్తూ శాంతి అవసరాన్ని చాటిచెప్పే రోజుగా ఇది నిలిచింది. 1945 ఆగస్టు 6న హిరోషిమాపై అణుబాంబు దాడి జరిగిన మూడు రోజులకే నాగసాకిపై మరో అణుబాంబు ప్రయోగించారు. "ఫ్యాట్ మ్యాన్" పేరుతో గుర్తింపు పొందిన ఈ బాంబు నగరాన్ని పూర్తిగా విధ్వంసం చేసింది. వేలాది భవనాలు నేలమట్టమయ్యాయి. అనేక కుటుంబాలు క్షణాల్లో చెదిరిపోయాయి. బతికి బయట పడినవారు కూడా తీవ్రమైన గాయాలు, కాలిన గాయాలతో జీవితాంతం బాధలు అనుభవించారు.

అణుబాంబు ప్రభావం తక్షణ విధ్వంసంతోనే ఆగిపోలేదు. రేడియోధార్మిక కిరణాల కారణంగా వేలాది మంది తర్వాతి సంవత్సరాల్లో క్యాన్సర్, జన్యుపరమైన వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడ్డారు. అనేక మంది పిల్లలు శారీరక లోపాలతో జన్మించారు. ఈ ప్రభావాలు దశాబ్దాల పాటు కొనసాగడం ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. యుద్ధంలో ఉపయోగించిన ఒకే ఆయుధం తరతరాల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుందో నాగసాకి ఉదంతం స్పష్టంగా చూపించింది. నాగసాకి దాడి తర్వాత కొద్ది రోజులకే రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది. అయితే ఆ విజయం వెనుక మానవాళి చెల్లించిన మూల్యం అమితమైనది. లక్షలాది ప్రాణనష్టంతో పాటు మానవ విలువలు, శాంతి, సహజీవనం వంటి అంశాలపై ప్రపంచవ్యాప్తంగా విస్తృత చర్చకు ఈ ఘటన కారణమైంది. యుద్ధాలు సమస్యలకు పరిష్కారం కాదనే అవగాహన మరింత బలపడింది.

నాగసాకి దినం కేవలం చరిత్రను గుర్తు చేసుకునే సందర్భం మాత్రమే కాదు. అణ్వస్త్రాల ముప్పు ఇప్పటికీ ప్రపంచంపై వేలాడుతున్న వాస్తవాన్ని గుర్తు చేసే రోజు కూడా. ఆధునిక యుగంలో అనేక దేశాలు అణ్వస్త్రాలను కలిగి ఉండటంతో ప్రపంచ భద్రతపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఒక చిన్న పొరపాటు కూడా మానవాళికి అపార నష్టాన్ని కలిగించగలదనే హెచ్చరిక నాగసాకి విషాదం అందిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా శాంతి ఉద్యమాలు, అణ్వస్త్ర నిరాయుధీకరణ కార్యక్రమాలు నాగసాకి, హిరోషిమా ఘటనల నుంచే మరింత బలపడ్డాయి. అణ్వస్త్రాలను పూర్తిగా నిర్మూలించాలని అనేక దేశాలు, అంతర్జాతీయ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. భవిష్యత్ తరాలు ఇటువంటి విపత్తులను ఎదుర్కోకుండా చూడడం అంతర్జాతీయ సమాజ బాధ్యతగా మారింది.

నాగసాకి నగరం నేడు పునర్నిర్మాణంతో అభివృద్ధి చెందినప్పటికీ, అక్కడి శాంతి స్మారక చిహ్నాలు, మ్యూజియంలు ఆ విషాద చరిత్రను సజీవంగా ఉంచుతున్నాయి. ప్రతి సంవత్సరం వేలాది మంది అక్కడికి వెళ్లి బాధితులకు నివాళులర్పిస్తారు. ప్రపంచ శాంతి కోసం సంకల్పం వ్యక్తం చేస్తారు. ఇది చరిత్రను మరువకుండా భవిష్యత్తును రక్షించుకోవాలనే సందేశాన్ని ఇస్తోంది. ప్రస్తుత తరానికి నాగసాకి చరిత్ర ఒక గొప్ప పాఠం. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం మానవ సంక్షేమానికి ఉపయోగపడాలి కానీ విధ్వంసానికి కాదు అనే సందేశాన్ని ఇది అందిస్తుంది. విజ్ఞానం, శక్తి, అభివృద్ధి అన్నీ మానవ విలువలతో కలిసినప్పుడే సార్థకమవుతాయని గుర్తు చేస్తుంది.

ప్రపంచ దేశాల మధ్య విభేదాలు, రాజకీయ ఉద్రిక్తతలు, సైనిక పోటీలు పెరుగుతున్న తరుణంలో నాగసాకి దినం ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. సమస్యలను సంభాషణల ద్వారా పరిష్కరించుకోవడం, శాంతియుత సహజీవనాన్ని ప్రోత్సహించడం, మానవ ప్రాణాలకు విలువ ఇవ్వడం వంటి అంశాలు నేటి ప్రపంచానికి అత్యవసరంగా మారాయి. నాగసాకి దినం మానవాళికి ఒక శాశ్వత హెచ్చరిక. యుద్ధం ఎంత భయంకరమైనదో, అణ్వస్త్రాలు ఎంతటి వినాశనాన్ని సృష్టించగలవో గుర్తు చేసే చారిత్రక సందర్భం. శాంతి, సహనం, పరస్పర గౌరవం, సహజీవనం వంటి విలువలను కాపాడుకోవడమే నాగసాకి విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి అందించే నిజమైన నివాళి. ప్రపంచం మరొక నాగసాకిని చూడకూడదనే సంకల్పమే ఈ దినం యొక్క అసలైన సందేశం.




# దుర్గమ్మ జాతరలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్

- **అమ్మవారికి ప్రత్యేక పూజలు**
- **మంచి వర్షా ల కోసం ప్రార్థనలు**
- **భక్తులతో కలిసి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే**

**సదాశివపేట, ఆగస్టు 8 (తెలంగాణ ముచ్చట్లు):** సదాశివపేట పట్టణంలో అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ దుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. జాతరలో భాగంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, శాంతి, సౌభాగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మంచి వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. జాతరలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల భారీ రద్దీ జాతరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో కళకళలాడాయి. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలను ఎమ్మెల్యే పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, నిర్వాహకులు తీసుకున్న చర్యలను అభినందించారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుతూ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో జాతరలో పాల్గొనడం ఆనందంగా ఉందని చింత ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## రామ్‌చరణ్-సుకుమార్ సినిమాలో రుక్మిణి వసంత్.. హీరోయిన్‌గా ఛాన్స్?

**హైదరాబాద్, ఆగస్టు 8, 2026 (తెలంగాణ ముచ్చట్లు):** రుక్మిణి వసంత్ తారాపథంలో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం ఈ భామ యశ్ 'టాక్సిక్', ఎన్టీఆర్ 'డ్రాగన్' వంటి భారీ చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. 'కాంతార ఛాప్టర్ 1' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న రుక్మిణికి అప్పటి నుంచి వరుసగా భారీ చిత్రాల్లో అవకాశాలు వస్తున్నాయి. తాజా సమాచారం ప్రకారం తెలుగులోనూ ఈ భామ మరో ప్రతిష్ఠాత్మక చిత్రంలో కథానాయికగా నటించే అవకాశం ఉన్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అగ్ర హీరో రామ్‌చరణ్ తన తదుపరి చిత్రాన్ని దర్శకుడు సుకుమార్ దర్శకత్వంలో చేయబోతున్న విషయం తెలిసిందే. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రామ్‌చరణ్-సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని వచ్చే నెలలో లాంఛనంగా ప్రారంభించి, నవంబర్‌లో చిత్రీకరణ ప్రారంభించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కథానాయిక ఎంపికపై చిత్రబృందం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. పలువురు ప్రముఖ కథానాయికల పేర్లను పరిశీలిస్తున్నప్పటికీ, రుక్మిణి వసంత్ పేరు ముందంజలో ఉన్నట్లు ఫిల్మ్‌నగర్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.రామ్‌చరణ్‌కు జోడీగా రుక్మిణి వసంత్ నటిస్తే ఈ కాంబినేషన్ ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని పెంచే అవకాశం ఉంది. ఇప్పటికే వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రుక్మిణికి ఈ అవకాశం దక్కితే తెలుగులో ఆమెకు మరో కీలక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. అయితే రామ్‌చరణ్-సుకుమార్ చిత్రంలో రుక్మిణి వసంత్ కథానాయికగా నటించనున్నారనే వార్తపై ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ ప్రచారంలో నిజమెంతో తెలియాలంటే మేకర్స్ అధికారికంగా ధృవీకరించాల్సిందే.

## 'అగధా'పై కామాక్షి భాస్కర్ల ఆసక్తికర వ్యాఖ్యలు.. "థ్రిల్లర్‌ను థియేటర్‌లోనే చూడాలి"



**హైదరాబాద్, ఆగస్టు 8, 2026 (తెలంగాణ ముచ్చట్లు):** విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తనదైన నటనతో ఆకట్టుకుంటున్న నటి కామాక్షి భాస్కర్ల మరో ఆసక్తికర చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 'మా ఊరి పొలిమేర' చిత్రంతో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె ప్రస్తుతం 'అగధా' సినిమాలో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కామాక్షి భాస్కర్ల పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానున్న 'అగధా'పై చిత్రబృందం ఎంతో నమ్మకంతో ఉందని కామాక్షి తెలిపారు. సినిమా తుది కాపీ సిద్ధంగా ఉందని, ప్రేక్షకులు తమ చిత్రాన్ని ఎలా స్వీకరిస్తారనే ఆసక్తితో పాటు కొంత టెన్షన్ కూడా ఉందని చెప్పారు. సినిమా బాగుంటుందని తమకు తెలుసని, అన్ని అంశాలు సరిగ్గా కలిసి అనుకూల వాతావరణం ఏర్పడితే తప్పకుండా విజయం సాధిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ రోజుల్లో సినిమా తీయడం ఒక ఎత్తయితే, దానిని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడం మరో ఎత్తు అని కామాక్షి భాస్కర్ల అభిప్రాయపడ్డారు. స్టార్ నటులు లేకపోతే ప్రేక్షకులు సినిమాను థియేటర్లలో చూసేందుకు కొంత వెనుకాడుతున్నారని, ఓటీటీలో చూసుకోవచ్చనే ఆలోచన చేస్తున్నారని తెలిపారు. 'మా ఊరి పొలిమేర' విషయంలో కూడా ఇలాంటి పరిస్థితి ఎదురైందని గుర్తుచేశారు.

థ్రిల్లర్ సినిమాలను చిన్న తెరపై కాకుండా పెద్ద తెరపై చూసినప్పుడే అసలైన అనుభూతి కలుగుతుందని కామాక్షి పేర్కొన్నారు. దర్శకుడు ఎం.ఎస్. రాజు గ్రాండియర్ సెట్స్‌కు పేరుగాంచారని, 'అగధా'లోని విజువల్స్ కూడా పెద్ద తెరపై మరింత ఆకట్టుకుంటాయని తెలిపారు. ప్రేక్షకులు ఈ సినిమాను థియేటర్లలో చూసి ఆస్వాదించాలని ఆమె కోరారు. ఇక తన వ్యక్తిగత జీవితంపై చలం రచించిన 'మైదానం' పుస్తకం చూపిన ప్రభావం గురించి కూడా కామాక్షి భాస్కర్ల మాట్లాడారు. చలం తన కాలంలో మహిళలకు స్వేచ్ఛ పరిమితంగా ఉన్న సమాజంలో కూడా "ఆడది కూడా మనిషే" అనే భావనను బలంగా చెప్పేందుకు ప్రయత్నించారని ఆమె పేర్కొన్నారు. చలం రచనలను ఇప్పటికీ కొందరు దర్శకులు తెరపై చూపించేందుకు సాహసించరని అభిప్రాయపడ్డారు. తాను అజ్ఞాతవాదినని, దేవుడు ఉన్నాడా లేదా అనే నమ్మకాలతో సంబంధం లేకుండా వాస్తవికంగా ఉండేందుకు ప్రయత్నిస్తానని కామాక్షి తెలిపారు. జీవితంలో కష్టాలు ఎదురైనప్పుడు లేదా నిరాశకు గురైనప్పుడు స్మశాన వాటికకు వెళ్తానని చెప్పారు. అక్కడికి వెళ్లినప్పుడు డబ్బు, పేరు, హోదా వంటివి ఎంత చిన్నవో అర్థమవుతుందని, జీవితం ఎంత తాత్కాలికమో గుర్తొచ్చి మరింత వాస్తవికంగా, నేలపై కాళ్లు పెట్టుకుని ఆలోచించగలుగుతానని కామాక్షి భాస్కర్ల వెల్లడించారు.

## నాని–సుజీత్ 'బ్లడీ రోమియో'.. హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే?

**హైదరాబాద్, ఆగస్టు 8, 2026 (తెలంగాణ ముచ్చట్లు):** టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న నేచరల్ స్టార్ నాని ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే నాని తన తదుపరి చిత్రాన్ని దర్శకుడు సుజీత్‌తో చేయనున్నారు. 'ఓజీ' వంటి భారీ చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న సుజీత్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుండటంతో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రానికి 'బ్లడీ రోమియో' అనే వైవిధ్యమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమా అక్టోబర్ నుంచి చిత్రీకరణ ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తోనే ఆసక్తిని పెంచుతున్న ఈ ప్రాజెక్ట్‌లో నానిని సరికొత్త కోణంలో సుజీత్ చూపించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఈ సినిమాలో నాని సరసన కథానాయికగా ఎవరు నటించనున్నారనే అంశంపై కొంతకాలంగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. తాజా ఫిలింనగర్ సమాచారం ప్రకారం యంగ్ అండ్ గ్లామరస్ నటి భాగ్యశ్రీ బోర్సేను కథానాయికగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే దర్శక నిర్మాతలు ఆమెతో సంప్రదింపులు జరిపినట్లు, కథతో పాటు తన పాత్ర రూపకల్పన నచ్చడంతో భాగ్యశ్రీ కూడా సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది.

నాని, భాగ్యశ్రీ బోర్సే కాంబినేషన్‌లో సినిమా వస్తే ఇది ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని పెంచే అవకాశం ఉంది. ముఖ్యంగా సుజీత్ మార్క్ యాక్షన్, గ్యాంగ్‌స్టర్ నేపథ్యానికి నాని ఇమేజ్ తోడవడంతో 'బ్లడీ రోమియో'పై అంచనాలు మరింత పెరుగుతున్నాయి.

అయితే భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా ఎంపికైన విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. త్వరలోనే హీరోయిన్‌తో పాటు సినిమాకు సంబంధించిన ఇతర వివరాలను మేకర్స్ అధికారికంగా వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in